

కథా కౌముది

# అబ్బే.. లాభం లేదు

చంద్రమౌళి కళ్యాణచక్రవర్తి

**"అబ్బే లాభంలేదు"** మూతి విరిచాడు. ముక్కు పింగళించాడు. కళ్ళు చిట్లించాడు. మొఖాన్ని చిట్లించాడు. ముఖ్యంగా పెదవి కూడా విరిచాడు. తల అటూ ఇటూ ఊపాడు. ఆ ఊపటంలో కూడా నిరాశ ఉంది. నిజానికి నిరాశకంటే కొంచెం ఎక్కువ. అలాగని నిరాసక్తత కాదు. నిరాశ, నిరాసక్తత, ఆశక్తత అన్నీ కలిపి తల ఊపుతూ ఉన్నాడు.

అంటే 'ఆలోచిస్తున్నాడు'. ఆలోచించటం అనేది. ఇక్కడ అతిశయోక్తి అలంకారం. అయినా సాంబడికి అన్వయించాల్సిన, ముఖ్యంగా ఆ క్షణంలో అన్వయించాల్సిన అతి ముఖ్యమైన అలంకారం. అవును నిఝం నిజ్జంగా నిజ్జం. సాంబడు ఆలోచిస్తున్నాడు. చాలా తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. అలవాటులేని పనికాబట్టి. నాకు కొంచెం ఇబ్బందిగా ఉంది. అయినా చెప్పక తప్పదు. సాంబడు ఆలోచిస్తున్నాడు. తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. అవును మరి ఆలోచించాల్సిన దుసిత్థి అతనికి ఎందుకు వచ్చింది? నిజానికి అది అతని తప్పుకాదు అనిపించింది. ఆ తప్పు పరిస్థితులది, అని నాకు గట్టి నమ్మకం. అయితే ప్రస్తుతం మనకు కావల్సింది, ఆ పరిస్థితులేంటి? అతను ఆ పరిస్థితుల్లోకి ఎందుకు నెట్టబడ్డాడు? ఏం జరిగింది? ఎలా జరిగింది? ఏ.. ఏ కారణాల వల్ల అలా జరిగింది? తెలుసుకోవాలని కుతూహలం. మీకే కాదు నాకూ కలిగింది.

"అబ్బే.. లాభం లేదు" గట్టిగా అన్నాడు. నాకూ వినిపించేంత గట్టిగానే అన్నాడు. నాకూ అర్థం అయింది. అతని ఉద్దేశ్యం. అయితే సాటి మనిషికి ఏం కష్టమొచ్చిందో పట్టించుకోని కుహనా మేధావులలాగా నేనూ తల తిప్పుకొని వెళ్ళిపోలేదు. ఎందుకంటే నేను నిఖార్సైన మేధావిని. పైగా మీ అందరి ఆసక్తిని గమనించి సంఘంలో బాధ్యత కలిగిన పెద్దమనిషిగా కేవలం పెద్దమనిషిగా మాత్రమే.. మీ అందరి కోరిక తీర్చటం నా బాధ్యతగా భావించి అత్యవసరమైన పనులు ఉన్నప్పటికీ వాటిని త్యాగం చేసి మీకోసం కేవలం మీకోసం ఈ సాంబడి సంగతేమిటో తేలుద్దామని ఆగాను.

అదుగో అదే అదే నాకు నచ్చదు. ఏదైనా సూటిగా మాట్లాడండి. గొణగొద్దు. అత్యవసరమైన పనులు ఏంటి అనా? అదే దినపత్రికని తిరగేయటం తేనీరు సేవించడం. మీకు అతి ముఖ్యమైన విషయాలు అనిపించకపోవచ్చు. కాని మాకు అవి అత్యవసరం. ఎవరి శరీర ధర్మాలు వారికి!

"అబ్బే లాభం లేదు" మళ్ళీ మూతివిరిచాడు. ముక్కు పింగళించాడు. ముఖ్యంగా పెదవి కూడా విరిచాడు పైపెచ్చు తనే విరిగిపోయాడు. "అబ్బే! లాభం లేదు ఈ దేశం బాగుపడదు" సూటిగా నాకే చెప్పాడు.

అటూ ఇటూ చూశాను. ఎవరూ లేరు. మేమిద్దరమే ఉన్నాం. అంటే నాకే చెప్పాడు "చూశారా" నాకే చెప్పాడు మళ్ళీ. ఇక తప్పలేదు. చూశాను.

"ఈ లోకంలో మంచి వాళ్ళకి స్థానమే లేదండి.." స్థిరంగానే చెప్పాడు.

నిర్ణయానికి వచ్చినవాడిలాగే మాట్లాడాడు. బాల్ నా కోర్టులోకి వచ్చింది. ఇక తప్పలేదు. నేనూ ఆలోచించాల్సిన సమయం వచ్చింది. మొదటిగా ప్రశ్న మీలాగే నా ఆలోచనలో కూడా అదే ప్రశ్న. మంచివాళ్ళకి స్థానం లేదా? నిజమా? అదేంటి నేను, మీరు అదిగో ఆ ఎదురింటివారు. ఆ ప్రక్కింటివారు. అందరూ మంచివారేగా? అంటే – మనందరము మంచివాళ్ళమేగా? మనకి బాగానే ఉంది. మనకంటూ ఒక స్థానం ఉంది. కాబట్టి మంచివాళ్ళకి స్థానంలేదు. అనటం యొక్క ఆంతర్యమేమిటి? అంటే సాంబడు మంచివాడా? కాదా? అదీ ప్రశ్న. ఒకవేళ అతను మంచివాడు అనుకుంటే అతనికి స్థానంలేదని బాధపడుతున్నాడా? అతనికి స్థానం ఎందుకులేదు? కారణం ఎవరు? పరిస్థితులు ఏంటి? ఒకవేళ అతను మంచివాడు కాదూ అనుకుంటే అతను తనని తాను మంచివాడని అని భ్రమపడుతున్నాడా? లేక ఇతర మంచివాళ్ళు (అంటే మనలాంటివాళ్ళు) వాళ్ళకి స్థానం లేదని నిర్ణయిస్తున్నాడా? అసలేం జరుగుతోంది?

"కలికాలం కాకపోతే మరేంటండీ?" నా ఆలోచనలను చిన్నాభిన్నం చేస్తూ మళ్ళీ ప్రశ్న. ప్రశ్నల తుట్టె. ప్రశ్నకు ప్రశ్న. ప్రశ్నపైన ప్రశ్న. ప్రశ్నకు సమాధానం ప్రశ్న. ఆలోచనాధార.. అదీ... "సాం...బ...డి" నుంచి అయ్యబాబోయ్.. నేను తట్టుకోలేను.. నేనేంటి మనలాంటి ఆలోచనగలవారు తట్టుకోలేరు.

ముందుగా మీకు సాంబడి గురించి కొంచెం తెలియాలి.

'సాంబడు' మనలాంటి మేధావుల దృష్టిలో అనామకుడు (అవుననుకోండి మనకి మనం మేధావులు అని చెప్పుకోకూడదు. నిజమే అయినా మనలో మనం అనుకోవచ్చు బయటవాళ్ళకి మాత్రం చెప్పకూడదు. మనం మేధావులం అని వాళ్ళ తెలుసుకోవాలి) అయితే ఈపాడు సామాన్య లోకం దృష్టిలో బ్రతకనేర్చిన వాడు, నెలకింత సంపాయించి పడేస్తూవుంటాడు. పెళ్ళాం పిల్లల్ని చాతనయినంతగా తన స్థాయిలో పోషిస్తూ ఉంటాడు. అయితే మనలాంటి మేధావి మాత్రంకాదు. ప్రపంచ సమస్యల గురించి తెలుసుకోడు, ఈదేశం ఎటుపోతోందో అతనికి అవసరంలేదు, దేశంలో సహనం ఉందోలేదో తెలీదు, తీవ్రవాదులోకాదో తెలీదు, దేశభక్తి ఉండాలో వద్దో తెలీదు. 'సహనం' దేశంలో ఉందో లేదో తెలియదు. పైగా ఆవేశపడటం మీటింగ్‌లకి వెళ్ళటం, మన ఆలోచనలని వ్యతిరేకించిన వారిని శతృవులుగా చూడటం విదేశాలని పొగడటం, దేశం పాడైపోతోంది. అని నిర్ణయం తీసుకునే శక్తికూడా లేదు. మనం అందరం ఈ విషయాలపై చర్చించి బుర్రలు వేడెక్కి ఇంటికెళ్ళి ఏ.సి వేసుకుని హాయిగా (క్షమించండి పరాకులో ఉన్నమాట అనేశాను) హాయిగా కాదు, నిద్రలేని రాత్రులు గడిపేవాళ్ళం.

ఈ సాంబడికి అలాంటి సద్గుణాలు ఏవీలేవు. మనలాంటి ఒకటోరకం మేధావి మాత్రం కాదు. ఈ విషయానికి నేనే సాక్ష్యం. ఎందుకంటే ఈ దేశం పాడైపోతోందని అసహనం ఎక్కువైందని కొందరు పెద్ద మేధావులు (అంటే మేస్త్రీలు అన్నమాట) అవార్డులు వెనక్కి ఇచ్చే ఉద్యమం చేపట్టినప్పుడు ఉడతాభక్తిగా నేనూ నా పాఠశాల వారు పదవతరగతిలో నాకు ఇచ్చిన మేధావి అవార్డ్ వెనక్కి ఇవ్వటం కోసం కార్యక్రమం పెట్టి అందరిని పిలిస్తే (ఈ సాంబడిని కూడా) అంత ముఖ్యమైన కార్యక్రమం వదిలేసి పెళ్ళాం పిల్లల్ని తీసుకుని విహారయాత్రకు వెళ్ళిన వాజమ్మ వాడు. అచ్చంగా నీరోచక్రవర్తి ఫిడేలు వాయించినంతగా "ఏమయ్యా రాలేదు?" అని ముఖాన అడిగితే వెధవ ఏమన్నాడో తెలుసా? "ఎందుకండీ తిన్నది అరక్క ఇలాంటి కార్యక్రమాలూ" అని అట్లా అవే మాటలు నా మొహాన చెప్పేశాడు. మనలాంటి మేధావులు ఏం చెప్పాలి? కుదరలేదనో లేక వేరే అర్జంట్ పని ఉందనో చెప్పాలి. కానీ వీడేంటి? అందుకే వీడు మేధావి కాదు! అది తేటతెల్లం.

ఇక ప్రస్తుతానికి వద్దాం. సాంబడు నన్నే చూస్తున్నాడు. సలహాకోసమేమో నేనూ సాంబడిని చూశా. మళ్ళీ సాంబడు ఆలోచనలో పడ్డాడు. ఈసారి జనాంతికంగా అన్నాడు. ముచ్చటగా మూడోసారి అన్నాడు. "అబ్బే లాభంలేదు.." ఈసారీ అంతే. మూతి విరిచాడు, ముక్కు పింగళించాడు. పైగా పెదవి కూడా విరిచాడు. కళ్ళెగరేశాడు. "ఈ దేశం బాగుపడదు" స్థిరంగా చెప్పాడు. రెండు చేతులతో ఆహ్వానించాల్సిన విషయం మేధావిలాగానే అన్నాడు. నాలోని మేధావికూడా నిద్రలేచాడు. "ఏం జరిగింది?"

"ఏం జరిగితే ఏంలెండి? మీరేమన్నా ఆరుస్తారా? తీరుస్తారా?"

"అసలేం జరిగింది?" అసహనంగా అడిగాను.

బాధ్యత నిద్రలేచింది, ఆవేశం నిద్రలేచింది.

"సాంబశివరావుగారూ చెప్పండి. ఏం జరిగిందో? నేనేమైనా సహాయం చెయ్యగలనా?"

సాంబశివరావు నావైపు కళ్ళెత్తి చూడు. తీక్షణంగా చూశాడు. ఏదో వెతుకుతున్నట్టు చూశాడు. ఏదో ఉంది. చెప్పబోతున్నాడు. ఇప్పటికి మీకు నాకు విషయం తెలియబోతోంది. ఇదే మనలాంటి మేధావులం ఎదురు చూస్తున్న తరుణం. ఆశక్తులని, ఆర్తులనీ, తాడితులనీ, పీడితులనీ ఉద్దరించబోతున్న తరుణం.

"చెప్పు ఏం జరిగిందో?" మళ్ళా సమరోత్సాహంతో అడిగాను, కులం సమస్య, ఏదైనా ఏమైనా సరే నేను విప్లవానికి నాంది పలకాల్సిందే. తరతరాలుగా జరిగిన తప్పులన్నీ ఈ రోజు సరిచెయ్యాల్సిందే. విప్లవానికి ఈరోజు నాంది పలకాల్సిందే ఈ మార్పుకోసం నన్ను నేను అర్పించుకోవాల్సిందే. పోరాటాల బాటలో వెనకడుగు వేసే ప్రసక్తేలేదు. నా ఆవేశం ఆగటంలేదు. మేధావులు ప్రపంచాన్ని ఎలా ప్రభావితం చేశారో చరిత్ర చెప్పిన పాఠాలన్నీ గుర్తుకొస్తున్నాయి.

ఛాందసవాదం ఈ దేశాన్ని ఎలా ముక్కలు చెక్కలు చేసిందో ప్రతీ పేజీని చించి అక్కడ నే వ్రాయబోయే కొత్త చరిత్ర రక్త చరిత్ర నాకు తెలుస్తోంది. బ్రహ్మాండం బద్దలు కాబోతోంది. నీకు తెలుస్తోంది. నాయకుడిగా ఇది నా మొదటి అడుగు. స్థిరంగా చూశా.

"ఏ సహాయం కావాలన్నా అడుగు సాంబశివరావు.. ఏం జరిగిందో చెప్పు" దర్పంగా దయగా ధీమాగా అడిగా. సాంబశివరావుగారు నా వైపు దీనంగా చూశారు. గట్టిగా ఊపిరి పీల్చి వదిలారు. నిర్ణయానికి వచ్చినవాడిలా.

"నాకు ఒక్క పదివేలు ఉంటే సర్దండి సార్. మళ్ళా ఫస్టుకి ఇచ్చేస్తా.. చాలా అవసరం పడింది. "

అందుకే ఈ దేశం బాగుపడదు. దొంగముండాకొడుకు.!!

Click here to share your comments on this story